అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 343 | వరంగల్ | మంగళవారం, 27 అక్టోబర్ 2026 | పేజీలు: 07

కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?

ఆరు గ్యారంటీల అమలు జాడేది..?



- రైతులు, మహిళలు, నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

3



ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు.. ప్రజలకు ఎన్నో హామీలు.. అధికారంలోకి వచ్చాక వాటి అమలు విషయంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీల మాటేమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం, పించన్ల పెంపు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆయా హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

- అక్షరశక్తి, తొర్రూరు

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో

రక్తదాన శిబిరం



- రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో 101 యూనిట్ల రక్తం సేకరణ
- స్వయంగా రక్తదానం చేసిన పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్

4

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో భీమారం శుభం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ స్వయంగా రక్తదానం చేసి, ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. - అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్



7

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను

వెంటనే పరిష్కరించాలి

డీఈఓకు టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా శాఖ వినతి

: జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) వరంగల్ జిల్లా శాఖ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి (ఎఫ్ఏసీ) ప్రశాంత్ రెడ్డిని కోరారు. వరంగల్ జిల్లా నూతన ఎఫ్ఏసీ డీఈఓగా ఇటీవల నియమితులైన ప్రశాంత్ రెడ్డిని టీపీటీఎఫ్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. - అక్షరశక్తి,వరంగల్



రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచిన పోలీస్ కమిషనర్

- స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపు

అక్షరశక్తి, హన్మకొండ : రక్తదానం చేసి వరంగల్ పోలీస్ కమిషనర్ సంద్యాల శ్వేత ఐపీఎస్ మానవత్వాన్ని చాటుకున్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందించడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చనే సందేశాన్ని తన చర్య ద్వారా ప్రజలకు అందించారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం ద్వారా ప్రాణదాతలుగా నిలవవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో రక్తదానంపై అవగాహన పెంపొందించడంతోపాటు ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా ఆమె రక్తదానం చేయడంపై పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు. రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

12 కిలోల బియ్యం, 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలి



అక్షరశక్తి, హన్మకొండ : హనుమకొండ జిల్లాతోపాటు అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్.ఎ. స్టాలిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల్లో ప్రజలకు చౌక ధరల దుకాణాల ద్వారా ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, 14 రకాల నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని కోరారు.మంగళవారం రామారంలోని ఓఆర్ఆర్ బ్రిడ్జి శాఖ సీపీఐ సమితి సమావేశం శాఖ సహాయ కార్యదర్శి పొక్కుల సదానందం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన స్టాలిన్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఒక్కొక్కరికి అందిస్తున్న ఆరు కిలోల బియ్యానికి అదనంగా మరో ఆరు కిలోలు కలిపి మొత్తం 12 కిలోలు ఇవ్వాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని, కరువు కారణంగా ఉపాధి కోల్పోతున్న అసంఘటిత కార్మికులకు ప్రత్యేక పథకం ద్వారా పని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి దామెర సుదర్శన్, పొక్కుల సదానందం, పార్వతం భాగ్య, రాగల్ల ప్రభాకర్, గోల్కొండ సారయ్య, గడ్డం సారయ్య, వంకుడోతు రాజ్‌కుమార్, జన్ను మంజుల, భోగం అనురాధ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండపర్తి ఎంఆర్‌పీఎస్ కమిటీకి ఫూలే విగ్రహం అందజేత



అక్షరశక్తి, హన్మకొండ : మహాత్మా జ్యోతిరావు ఫూలే విగ్రహ స్థాపన సంకల్ప దీక్షలో భాగంగా కొండపర్తి ఎంఆర్‌పీఎస్ కమిటీకి ఫూలే విగ్రహాన్ని అందజేశారు. ఆర్ట్స్ కళాశాల క్యాంటీన్ ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విగ్రహదాత డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్ ఆహ్వానం మేరకు కళాశాల ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొని, ఎంఆర్‌పీఎస్ నాయకుడు బొక్కల నారాయణకు విగ్రహాన్ని అందించారు.సామాజికవేత్త కేదల ప్రసాద్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ చైర్మన్ డాక్టర్ దామెర భిక్షపతి, బాధ్యుడు డాక్టర్ మదాసు కనకయ్య మాట్లాడుతూ ఫూలే విగ్రహాల స్థాపన ద్వారా బహుజన భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ బీసీ సెల్ బాధ్యుడు డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ వెంకట్ నాయక్, డాక్టర్ జట్టి రాజేందర్, ప్రైవేట్ డ్రైవర్స్ అసోసియేషన్ బాధ్యులు సిరిగిరి రవీందర్, ఐతం నగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌నినో నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు చేపట్టాలి





- నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక కార్యాచరణ

అక్షరశక్తి, ములుగు: ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ములుగు కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధి హామీ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీటి వసతులు, జలసిరి పనులు, ఉపాధి కూలీల హాజరు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పనిదినాల కల్పనపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలోని అన్ని ఆవాసాల్లో తాగునీటి వసతులపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చూడాలని, చేతిపంపులు, మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి ట్యాంకులను శుభ్రపరచడం, లీకేజీల నివారణ, నీటి శుద్ధి, అవశేష క్లోరిన్ పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. భూగర్భ జలమట్టాలు తగ్గి తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్న ఆవాసాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాట్లు చేయాలన్నారు. మండల స్థాయి బృందాలు ఆవాసాల వారీగా పర్యటించి రోజువారీ నివేదికలు సమర్పించాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు పెంచడంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులకు పనిదినాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, వర్మీ కంపోస్టు ట్యాంకులు తదితర పనులకు అంచనాల సమర్పణ నుంచి అనుమతుల మంజూరు వరకు అన్ని దశలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు ఉదయం నుంచే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షించాలని, నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, డీఆర్‌డీఓ రవీందర్, డీపీఓ వెంకయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి సునీత, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్ర వికాసానికి క్రీడలు దోహదం

- కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం

అక్షరశక్తి, హనుమకొండ క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయ ఓఎస్డీ ఆచార్య వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు నిరంతరం సాధన చేస్తూ తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కాకతీయ విశ్వవిద్యాలయ క్రీడా విభాగం కార్యదర్శి డాక్టర్ శాస్త్రి మాట్లాడుతూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు విద్యార్థులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయని అన్నారు. క్రీడల్లో రాణించి విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల క్రీడా విభాగ అధ్యాపకులు డాక్టర్ ఏ.టి.బి.టి. ప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, సహాయ రిజిస్ట్రార్ సునీల్, భూక్య రాజు, ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ ఆదిరెడ్డి, వివిధ కళాశాలల క్రీడా విభాగ అధ్యాపకులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ హామీలు ఏమయ్యాయి?

- ఆరు గ్యారంటీల అమలు జాడేది..?
- రైతులు, మహిళలు, నిరుద్యోగులకు సమాధానం చెప్పాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు





అక్షరశక్తి, తొర్రూరు, అక్టోబర్ 27: ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు.. ప్రజలకు ఎన్నో హామీలు.. అధికారంలోకి వచ్చాక వాటి అమలు విషయంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేద కుటుంబాలకు ఇచ్చిన హామీల మాటేమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సహాయం, పింఛన్ల పెంపు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆయా హామీల అమలుపై ప్రజలకు స్పష్టమైన లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలేవి?

రైతుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. రైతులకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి చూపాలని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సాగు ఖర్చులు పెరిగి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో వారికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాల ప్రయోజనాలు అర్హులైన రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల ఆశలను నీరుగార్చకుండా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని హితవు పలికారు.

మహిళలు, నిరుద్యోగుల ఆశలపై నీళ్లు!

మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని, పేద కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటి అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఎన్నికల ముందు యువతకు భరోసా ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వారి సమస్యలను పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేయాలని సూచించారు.

పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలి..

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు పలకాలని ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై ప్రజలకు వివరించాలని, బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, పేద కుటుంబాల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీల అమలుపై స్పష్టమైన వివరాలను ప్రజల ముందుంచాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలుపై సమాధానం చెప్పేలా బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తుందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పట్టభద్రులు పాల్గొన్నారు.

ప్రతి ఓటరూ ప్రజాస్వామ్య కాపలాదారుడే

అక్షరశక్తి, కేయూక్యాంపస్ : ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు కీలక పాత్ర పోషించాలని కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య బి. సురేష్ లాల్ అన్నారు. ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని పేర్కొన్నారు. మంగళవారం దూరవిద్యా కేంద్రం ఆవరణలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు చైతన్య కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు మార్పునకు ఆయుధమని, ప్రజల అభివృద్ధికి పునాది వేస్తుందని తెలిపారు. ఓటును అమ్ముకోకుండా, ప్రలోభాలకు లొంగకుండా ఆత్మసాక్షిగా ఓటు వేసి నిజాయితీగల వ్యక్తులను ఎన్నుకోవాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగాధిపతి, సామాజిక ఉద్యమకారుడు సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఒక్కరూ తమ వివరాలను సంబంధిత ప్రాంత బీఎల్ఓలకు అందజేసి ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం డిప్లొమా, డిగ్రీ చదివిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ ఆడే ప్రాజెక్టు, గీసుకొండ ఎస్ఐ రవీందర్, డాక్టర్ వంగాల సుధాకర్, ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాలు ప్రారంభం



అక్షరశక్తి, హన్మకొండ : వరంగల్ -ఖమ్మం -నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదును ప్రోత్సహించేందుకు వర్ధన్నపేట నియోజకవర్గంలో ఉచిత నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. హసన్‌పర్తి మండలం సిద్ధాపూర్, గ్రేటర్ వరంగల్ 43వ డివిజన్ పరిధిలోని బెస్తంచెరువు గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి. కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ మసూద్, మాజీ మండల పార్టీ అధ్యక్షురాలు బండి రజని, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జక్కు రమేష్ గౌడ్, సిద్ధాపూర్ ఉపసర్పంచ్ కొక్కిస ప్రసన్న, క్రాంతి, వార్డు సభ్యుడు ముస్కు అభిలాష్, మాజీ సర్పంచ్ ఈశ్వరమ్మ, షణ్ముఖ రెడ్డి, అర్చన, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాకాఫ్ కాంట్రాక్టు రద్దు చేయాలి

- హాస్టళ్ల మూసివేత నిర్ణయాన్ని విరమించుకోవాలి



అక్షరశక్తి, హన్మకొండ : వసతి గృహాలకు నిత్యావసర సరుకుల సరఫరాలో విఫలమైన నాకాఫ్ (ఎన్‌సీసీఎఫ్) కాంట్రాక్టును రద్దు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ పేరుతో హాస్టళ్లను మూసివేసే ఆలోచనను విరమించుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 1,024 గురుకులాలు, 243 ఆశ్రమ పాఠశాలలు, 400కు పైగా కేజీబీవీలకు సరుకుల సరఫరా నిలిచిపోయిందని ఆరోపించారు. దీంతో వసతి గృహాల వార్డెన్లు అప్పులు చేయాల్సి వస్తోందని, విద్యార్థులకు అందించే భోజన మెనూలో కోతలు విధించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఆర్ఎస్ పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లను మూసివేసే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ చేపట్టి, అప్పటివరకు పాత కాంట్రాక్టర్ల ద్వారా సరుకుల సరఫరాను కొనసాగించాలని, జిల్లా స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు ప్రవీణ్, సంతోష్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడాలి



- 31న కొత్తగూడెంలో టీపీఎఫ్ ఆవిర్భావ సభ

అక్షరశక్తి, హన్మకొండ : తెలంగాణ అస్తిత్వంపై మళ్లీ ప్రారంభమైన కోస్తాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక తెలంగాణ కోసం పోరాడాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పాకాల వెంకన్న పిలుపునిచ్చారు. ఈ నెల 31న కొత్తగూడెంలో నిర్వహించనున్న తెలంగాణ ప్రజాఫ్రంట్ 17వ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం హనుమకొండ అంబేడ్కర్ సెంటర్‌లో పాకాల వెంకన్న అధ్వర్యంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, మేధావులు, కార్మికులు, రైతులు, మహిళలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణం కోసం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీఎఫ్ రాష్ట్ర నాయకుడు కడమంచి వెంకన్న, కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకులు, డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రవణ్, జిల్లా కన్వీనర్ శివ, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి భరత్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పంతులుపల్లి పాఠశాలకు కంప్యూటర్, ల్యాప్‌టాప్

అక్షరశక్తి, నర్సంపేట(నల్లబెల్లి), అక్టోబర్ 27: నల్లబెల్లి మండలం పంతులుపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం సమకూర్చిన కంప్యూటర్, ల్యాప్‌టాప్‌ను మంగళవారం ప్రారంభించారు. దాతల సహకారంతో పాఠశాలకు అందించిన ఈ పరికరాలను గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత రఘున, ఎంఈవో ఎం. అనూరాధ, పీఆర్‌టీయూ టీఎస్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కర్ణకంటి రాంమూర్తి మాట్లాడుతూ హనుమకొండకు చెందిన హెడ్ కానిస్టేబుల్ అడ్డూరి రాజనరేందర్ జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు పాఠశాలకు కంప్యూటర్‌ను బహూకరించినట్లు తెలిపారు. అమెరికాలో స్థిరపడిన గీసుకొండకు చెందిన శాస్త్రవేత్త దంపతులు డాక్టర్ పసునూటి స్వాతి, కళ్యాణ్ పాఠశాలకు ఫర్నిచర్ అందించారని, సహ ఉపాధ్యాయుడు కూనమళ్ల రాజన్ బాబు తన సొంత ఖర్చులతో ల్యాప్‌టాప్‌ను సమకూర్చారని పేర్కొంటూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈవో అనూరాధ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాబోధనలో మంచి పనితీరు కనబరుస్తూ దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక సదుపాయాలను పెంపొందించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ లలిత తమ గ్రామ పాఠశాలలో ఇలాంటి ఉపాధ్యాయులు పనిచేయడం అదృష్టమన్నారు. నకిరెడ్డి మహేందర్ మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి సంతోషకరమని, పాఠశాల అభివృద్ధికి తనవంతు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ చైర్మన్ కదురు లావణ్య, పీఆర్‌టీయూ నాయకులు ఉడుత రాజేందర్, బానోతు కృష్ణ, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్ సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం

- **రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో 101 యూనిట్ల రక్తం సేకరణ**
- **స్వయంగా రక్తదానం చేసిన పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్**





అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో భీమారం శుభం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 101 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ స్వయంగా రక్తదానం చేసి, ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అదనపు డీసీపీలు సురేష్, వి. శ్రీనివాస్, ఏసీపీలు మధుసూదన్, నరసింహారావు, సత్యనారాయణ, ఏఆర్ ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, సురేంద్ర, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి.శ్రీనివాస్ రావు, రెడ్ క్రాస్ జిల్లా పాలక మండలి సభ్యులు కె.రాకేష్ రావు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఓరుగల్లు పరపతి సంఘం విహారయాత్ర



అక్షరశక్తి, వరంగల్: విజ్ఞాన, వినోదాల మేళవింపుగా ఓరుగల్లు పరపతి సంఘం చేపట్టిన యాత్ర మంగళవారం ముగిసింది. మహారాష్ట్ర లోని చారిత్రక సింధుదుర్గ్ ప్రాంతంలో ఈ యాత్ర మూడు రోజుల పాటు ఉత్సాహంగా కొనసాగింది. సభ్యులు తెలిపిన మేరకు యాత్ర విశేషాలు ఇలా ఉన్నాయి. గత ఆదివారం హైదరాబాదు నుంచి విమానం ద్వారా సింధుదుర్గ్ చేరుకున్న సభ్యులు.. తర్కార్లి దేవ్ భాగ్ లో అరేబియా సముద్రం చెంతన రిసార్ట్ లో బస చేశారు. ఆటపాటలతో గడిపారు. డీజేలో తెలంగాణ పాటలతో హోరెత్తించారు. రెండోరోజు ఉదయం స్థానిక బీచ్ లో సముద్ర స్నానాలు చేసిన అనంతరం దేవ్ గఢ్ కు బయలుదేరారు. కొంకణ్ తీరంలోని 900 ఏళ్ల నాటి పురాతన కుంకేశ్వర్ ఆలయాన్ని దర్శించుకున్నారు. సముద్రం ఒడ్డున కొండపై మహాదేవుడు లింగం రూపంలో కొలువుదీరిన ఈ ఆలయం అనేక విశేషాలతో ఆకట్టుకుంది.పలువురు సభ్యులు పూజలు జరిపారు. అక్కడినుంచి దేవ్ గఢ్ పార్కును సందర్శించి ఉత్సాహంగా గడిపారు. ఇక్కడ ప్రకృతి అందాలు ఎంతో ఆకట్టుకున్నాయి.

ఆ తర్వాత అరేబియా సముద్రంలో మరాఠా చక్రవర్తి ఛత్రపతి శివాజి 17వ శతాబ్దంలో నిర్మించిన సింధుదుర్గ్ కోటను పడవల్లో వెళ్లి సందర్శించారు. సముద్ర మార్గంలో పోర్చుగీసు, డచ్, బ్రిటిష్ వారి దాడులను ఎదుర్కొనేందుకు శివాజి వలయాకారంలో నిర్మించిన ఈ కోట ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండటాన్ని చూసి సభ్యులు ఆశ్చర్యపోయారు. మంచినీటి వసతి కోసం అప్పుడు నిర్మించిన దూద్ బావి, దహి బావి, శక్కర్ బావి, కోనేరుతో పాటు శివరాజేశ్వర్, భవాని మాత ఆలయాలు, శివాజీ జెండా ఆకట్టుకున్నాయి. అక్కడి నుంచి రాజ్ కోట్ లోని 91 అడుగుల భారీ శివాజి విగ్రహాన్ని సందర్శించారు. జై శివాజీ నినాదాలతో హోరెత్తించారు. అన్ని చోట్లా అరేబియా సముద్రపు అందాలు మురిపించాయి. మూడో రోజైన మంగళవారం డైరెక్టర్ల నేతృత్వంలో తర్కార్లి దేవ్ భాగ్ లోని రిసార్ట్ లో సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సభ్యుల సంక్షేమానికి, సంఘం ఆర్థిక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం సింధుదుర్గ్ కు వీడ్కోలు చెబుతూ యాత్రను ముగించి మళ్లీ విమానం ఎక్కారు. మంగళవారం సాయంత్రం సభ్యులు వరంగల్ చేరుకున్నారు. ఈ యాత్ర లో డైరెక్టర్లు మందా శ్రీనివాస్, కత్తెర శాల వేణుగోపాల్, గాదె మధుసూదన్, ముష్కమల్ల సుధాకర్, పాలకుర్తి వేణుగోపాల్, సభ్యులు పాల్గొన్నారు. వరంగల్ ప్రాంతానికి చెందిన ఈ సంఘంలో అన్ని వర్గాల వారు సభ్యులు గా కొనసాగుతున్నారు. పొదుపు, రుణ వితరణ ద్వారా ఆర్థిక అవసరాలు తీర్చుకోవడంతో పాటు, రెండేళ్లకోసారి విజ్ఞాన, విహార యాత్రలు చేపడుతున్నారు.

వరంగల్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

కలెక్టరేట్‌లో ఏఐకేఎంఎస్ వినతి



అక్షరశక్తి, వరంగల్ : వరంగల్ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో అసిస్టెంట్ కలెక్టర్ కిషోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. దీంతో పంటలు పాక్షికంగానే పండాయని, ఎండల తీవ్రతకు చేతికొచ్చిన పంటలు కూడా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావంతో బావులు, బోరుబావులు, చెరువుల్లో నీటిమట్టాలు తగ్గి వరి పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. లోవోల్టేజీ విద్యుత్ సరఫరాతో మోటార్లు కాలిపోతున్నాయని, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కూడా తగ్గిందని పేర్కొన్నారు. మరోవైపు విద్యుత్ చార్జీల పేరుతో డిస్కంలకు రూ.7,635 కోట్ల రికవరీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, నవంబర్, డిసెంబర్ నుంచి యూనిట్‌కు 50 పైసల చొప్పున చార్జీలు పెంచే ప్రతిపాదనలు ప్రజలపై భారాన్ని పెంచుతాయని విమర్శించారు. రబీ సీజన్‌లో పంటలు వేయొద్దని ప్రకటించిన ప్రభుత్వం రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించకుండా ఉపాధి హామీ పథకం అమలుతో సరిపెట్టుకోవడం సరికాదన్నారు. వెంటనే కరువు నివారణ చర్యలు చేపట్టి రైతుల జీవన భద్రతకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో బండి వెంకటేశ్వర్లు, గంద్రతి హరిబాబు, బన్న నరసింగం, ఎండీ అక్బర్ తదితరులు ఉన్నారు.

పోలీస్ సైకిల్ ర్యాలీ...

అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ



అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన సైకిల్ ర్యాలీ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే సందేశాన్ని చాటింది. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, ఎన్ పి డిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రై సిటీ లోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ వారికి అంకితమైన ఘనమైన నివాళి అని తెలిపారు.సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాలు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఏఆర్ అదనపు డీసీపీలు వి.శ్రీనివాస్, సురేష్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ లను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింహారావు, సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, నగరంలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు సుమారు 200 మంది పాల్గొన్నారు.



ఆదాయం పెరిగినా అందని ఆర్థిక భరోసా.. ఆధునికత ముసుగులో అంతులేని ఖర్చులు



జీతం పెరుగుతోంది.. జీవన ప్రమాణాలు మారుతున్నాయి.. మన చేతిలోకి కొత్త కొత్త వస్తువులు వస్తున్నాయి.. అయినా నెలాఖరులో మాత్రం మళ్ళీ అదే మాట డబ్బులు చాలట్లేదు. ఒకప్పుడు సంపాదనలో కొంత మిగిలితే కుటుంబానికి భరోసా ఉండేది. ఇప్పుడు సంపాదన పెరిగినా పాడుపు పెరగడం లేదు. అవసరాల పేరుతో మొదలైన ఖర్చులు, హోదా కోసం చేసే ఆర్భాటాలు, సౌకర్యాల ముసుగులో పెరుగుతున్న ఆర్థిక బాధ్యతలు మనిషిని తెలియకుండానే అప్పుల ఊబిలోకి నెడుతున్నాయి. అసలు ఆదాయం పెరిగినా ఆర్థిక భద్రత ఎందుకు పెరగడం లేదు. ఆధునిక జీవనశైలి మనకు సౌకర్యాలను అందిస్తోందా.. లేక కొత్త ఆర్థిక సంకెళ్లను సృష్టిస్తోందా.

సంపాదన పెరిగింది..

కానీ సంతోషం ఎందుకు కరువైంది

ఒకప్పుడు కుటుంబంలో ఒకరు సంపాదిస్తే మరొకరు ఇంటి అవసరాలను పాడుపుగా చక్కదిద్దేవారు. నెలవారీ ఆదాయాన్ని ముందుగానే లెక్క వేసుకొని, అత్యవసరాలకు కొంత, పిల్లల భవిష్యత్తుకు మరికొంత, కుటుంబ అవసరాలకు ఇంకొంత కేటాయించుకునేవారు. ఖర్చులకు హద్దులు ఉండేవి. కొనుగోళ్లకు ముందు ఆలోచన ఉండేది. అప్పు చేయాల్సి వస్తే ఒకటికి రెండుసార్లు ఆలోచించేవారు. కాలం మారింది కుటుంబ ఆదాయాలు పెరిగాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంట్లో ఆధునిక పరికరాలు చేరుతున్నాయి. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఇంట్లో స్మార్ట్ టీవీ, ప్రయాణాలకు సొంత వాహనం, ఆన్‌లైన్‌లో క్షణాల్లో కొనుగోళ్లు.. జీవితం సౌకర్యవంతంగా మారింది. గతంలో కలలుగా కనిపించిన ఎన్నో వస్తువులు ఇప్పుడు సాధారణ అవసరాలుగా మారిపోయాయి.

కానీ ఈ మార్పుల మధ్య ఒక ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకడం లేదు. సంపాదన పెరిగిన కొద్దీ కుటుంబానికి ఆర్థిక భరోసా ఎందుకు పెరగడం లేదు అనేది. జీతం వచ్చిన మొదటి వారంలోనే అద్దె లేదా ఇంటి రుణ వాయిదా, పిల్లల స్కూల్ ఫీజులు, వాహన రుణం, కరెంటు బిల్లులు, నిత్యావసరాలు, రవాణా ఖర్చులు.. ఇలా ఆదాయానికి ముందే ఖర్చులు వరుస కట్టేస్తున్నాయి. నెల మొదట్లో కనిపించిన జీతం, నెల మధ్యలోనే లెక్కల్లో మాయమవుతోంది. నెలాఖరు వచ్చేసరికి మిగిలేది పాడుపు కాదు.. వచ్చే నెల ఎలా గడపాలనే ఆలోచన. ఇది కేవలం ఒక్క కుటుంబం ఎదుర్కొంటున్న సమస్య కాదు. ఆదాయం పెరిగినా ఆర్థిక స్వేచ్ఛను అనుభవించ లేకపోతున్న అనేక కుటుంబాల జీవన వాస్తవికత.

అవసరాలకు హద్దులున్నా... అంతులేని ఆశలెన్నో

మనిషి అవసరాలు పరిమితమైనవే కావచ్చు. కానీ వాటి రూపాలు మారుతూ ఉంటాయి. ఒకప్పుడు తినడానికి ఆహారం, ఉండటానికి ఇల్లు, ప్రయాణానికి వాహనం ఉంటే సరిపోతుందని భావించేవారు. ఇప్పుడు ఇంట్లో ఏ వస్తువు ఉందన్నదానికంటే, అది ఏ బ్రాండ్‌కు చెందినది ఎంత ఆధునికమైనది? ఇతరుల ఇళ్లతో పోలిస్తే మన ఇల్లు ఎంత ఆకర్షణీయంగా ఉంది? అనే ప్రశ్నలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

పాత ఫోన్ పనిచేస్తున్నా కొత్త మోడల్ మార్కెట్లోకి వస్తే కొనాలనిపిస్తుంది. ఇంట్లో ఉన్న వాహనం ప్రయాణానికి సరిపోతున్నా కొత్త మోడల్ ఆకర్షిస్తుంది. బట్టలు అవసరానికి మించి ఉన్నా కొత్త ఫ్యాషన్ కనిపిస్తే చాలు కొనుగోలు చేయాలనిపిస్తుంది. ఇంట్లో ఉన్న వస్తువులు ఉపయోగించదగినవే అయినా, వాటి స్థానంలో కొత్తవి ఉండాలని మనసు కోరుకుంటుంది.

ఇక్కడే అవసరానికి, ఆకాంక్షకు మధ్య ఉన్న సన్నని గీత చెరిగిపోతోంది.

నిజమైన అవసరం లేకపోయినా, కొనుగోలు చేయగలిగే స్థోమత ఉందన్న కారణంతో వస్తువులు కొంటున్నాం. కొన్నిసార్లు మనకు నిజంగా అవసరమైనందుకు కాదు.. ఇతరుల దగ్గర ఉన్నందుకు కొనుగోలు చేస్తున్నాం. మరికొన్నిసార్లు మన స్థాయిని ఇతరులకు చూపించాలనే తపనతో ఖర్చు చేస్తున్నాం. ఇలా కొనుగోలు చేసే ప్రతి వస్తువు మన జీవితాన్ని మెరుగుపరుస్తుందని చెప్పలేం. కొన్ని సౌకర్యాన్ని ఇస్తాయి. మరికొన్ని కొద్దిసేపటి ఆనందాన్ని ఇస్తాయి. ఇంకొన్ని మాత్రం మనకు తెలియకుండానే నెలవారీ బడ్జెట్‌పై భారంగా మారతాయి.

వస్తువులు పెరిగినంత మాత్రాన జీవన నాణ్యత పెరగదు. వాటిని సమకూర్చుకోవడానికి మనశ్శాంతిని తాకట్టు పెట్టాల్సి వస్తే, ఆ అభివృద్ధి వెనుక అసలు ప్రయోజనమేమిటి?

ఆధునికతా.. ఆడంబరమా?

ఆధునికతను తప్పపట్టాల్సిన అవసరం లేదు. సాంకేతిక పరిజ్ఞానం మనిషి జీవితాన్ని

సులభతరం చేసింది. సమస్య ఆధునికతలో లేదు. దానిని మనం ఎలా ఉపయోగించుకుంటున్నామన్నదాంట్లోనే ఉంది. అవసరాన్ని బట్టి సాంకేతికతను వినియోగించు కోవడం ఒక పద్ధతి. సాంకేతికత చూపిస్తున్న ప్రతి కొత్త వస్తువును మన జీవితంలోకి ఆహ్వానించడం మరో పద్ధతి. మొదటిది సౌకర్యాన్ని పెంచుతుంది. రెండోది అనవసరపు ఆర్థిక బాధ్యతలను పెంచే ప్రమాదం కలిగిస్తుంది. గతంలో వస్తువు కొనాలంటే దుకాణానికి వెళ్లాలి. ధర అడగాలి. డబ్బు సిద్ధం చేసుకోవాలి. కొనుగోలుపై ఆలోచించడానికి కొంత సమయం దొరికేది. ఇప్పుడు మొబైల్ తెరిస్తే చాలు.. నచ్చిన వస్తువు క్షణాల్లో ఇంటికి చేరుతుంది. ఒక క్లిక్‌తో కొనుగోలు, మరో క్లిక్‌తో చెల్లింపు. డబ్బు చేతి నుంచి వెళ్లిన అనుభూతి కూడా చాలామందికి కలగడం లేదు.

ఇతరుల జీవితాల్లో కనిపించే వైభవాన్ని మన జీవితానికి కొలమానంగా తీసుకుంటున్నాం. వారి ప్రయాణాలు చూసి మనకూ అలాంటి విహారయాత్ర కావాలనిపిస్తుంది. వారి ఇల్లు చూసి మన ఇంటిని మార్చుకోవాలని పిస్తుంది. వారి వేడుకలు చూసి మన వేడుకలను మరింత ఘనంగా నిర్వహించాలనిపిస్తుంది. ఇతరుల జీవితాల్లో కనిపించే సౌకర్యాలను అనుకరిస్తున్నాం. కానీ వాటి వెనుక ఉన్న ఆర్థిక సామర్థ్యం మనకూ ఉందో లేదో ఆలోచించడం మరిచిపోతున్నాం.

ఈ రోజుల్లో చేతిలో డబ్బు లేకపోయినా కొనుగోలు చేసే వెసులుబాటు ఉంది

ఒకప్పుడు జేబులో డబ్బుంటేనే కొనుగోలు చేసేవారు. ఇప్పుడు చేతిలో డబ్బు లేకపోయినా కొనుగోలు చేయగలుగుతున్నాం. క్రెడిట్ కార్డులు, సులభ వాయిదా పథకాలు, తక్షణ రుణాలు మన కొనుగోలు సామర్థ్యాన్ని పెంచినట్లు కనిపిస్తున్నాయి. వస్తువు ధరను ఒకేసారి చెల్లించాల్సిన అవసరం లేకపోవడం కొనుగోలును సులభతరం చేస్తోంది. చిన్నచిన్న వాయిదాలుగా చెల్లించవచ్చన్న భావనతో పెద్ద ఖర్చులు కూడా తేలికగా అనిపిస్తున్నాయి.

అనుకోకుండా ఉద్యోగం కోల్పోయినా, అనారోగ్యం వచ్చినా, కుటుంబంలో అత్యవసర పరిస్థితి ఎదురైనా ఈ వాయిదాలు మాత్రం ఆగవు. ఆదాయం తగ్గినా చెల్లింపుల బాధ్యత తగ్గదు. అప్పుడు ఇప్పటివరకు సౌకర్యంగా కనిపించిన జీవనశైలి ఆర్థిక ఒత్తిడిగా మారుతుంది.

ఇంట్లో ఇద్దరు సంపాదిస్తున్నా.. భరోసా ఎందుకు కరవవుతోంది?

ఒకప్పుడు కుటుంబంలో ఒకరి సంపాదనతోనే అనేక అవసరాలను తీర్చుకునే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు చాలామంది కుటుంబాల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. కుటుంబ ఆదాయం పెరుగుతోంది. అయినప్పటికీ పిల్లల విద్య, ఇంటి రుణం, ఆరోగ్య ఖర్చులు, వాహన నిర్వహణ, రోజువారీ అవసరాలు కుటుంబ బడ్జెట్‌ను ఒత్తిడికి గురిచేస్తున్నాయి.

దీనికి కారణాలు అనేకం పట్టణ ప్రాంతాల్లో ఖర్చులు అధికంగా ఉండటం మరోవైపు జీవనశైలి మార్పులు, పెరిగిన వినియోగ అలవాట్లు, ప్రణాళికలేని కొనుగోళ్లు కూడా సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి ఆదాయం పెరిగినప్పుడు ఖర్చులను కూడా అదే వేగంతో పెంచుకోవడం ఒక ముఖ్యమైన కారణం. నిన్నటి వరకు చిన్న ఇంట్లో ఉన్న కుటుంబానికి ఆదాయం పెరగగానే పెద్ద ఇంటికి మారాలన్న ఆలోచన వస్తోంది. పెద్ద ఇంటితో పాటు అధిక అద్దె లేదా రుణ వాయిదా, నిర్వహణ ఖర్చులు పెరుగుతాయి. పాత వాహనం స్థానంలో కొత్త వాహనం వస్తుంది. నిర్వహణ ఖర్చులు పెరగవచ్చు. పిల్లలకు మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో అదనపు తరగతులు, ప్రత్యేక శిక్షణలు, ఖరీదైన కార్యక్రమాలకు ఖర్చు పెరుగుతుంది. వీటిలో చాలా ఖర్చులకు సముచితమైన కారణాలుంటాయి. పిల్లల విద్య, ఆరోగ్యం, సురక్షితమైన నివాసం వంటి వాటిపై ఖర్చు చేయడం తప్పు కాదు. కానీ ప్రతి ఆదాయ పెరుగుదలకూ సమానమైన కొత్త బాధ్యతను జోడించుకుంటే భవిష్యత్తు కోసం డబ్బు మిగలడం కష్టమవుతుంది.

పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు.. తల్లిదండ్రుల భవిష్యత్తుకు భారంగా మారనుందా

పిల్లలకు మంచి విద్య అందించాలనే కోరిక ప్రతి తల్లిదండ్రికీ ఉంటుంది. తమకు దక్కని అవకాశాలు పిల్లలకు కల్పించాలనుకుంటారు. అందుకోసం తమ అవసరాలను తగ్గించుకోవడానికి కూడా సిద్ధపడతారు. కానీ పిల్లల భవిష్యత్తు పేరుతో తల్లిదండ్రులు తమ ఆర్థిక భద్రతను పూర్తిగా పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసం స్కూల్ ఫీజులు, అదనపు శిక్షణ, ప్రత్యేక తరగతులు, ఖరీదైన పరికరాలు, పుట్టినరోజు వేడుకలు.. ఒక్కో ఖర్చు వెనుక పిల్లలపై ప్రేమ ఉంటుంది. అయితే ప్రేమను నిరూపించడానికి ప్రతి ఖర్చునూ అంగీకరించాల్సిన అవసరం లేదు. పిల్లలకు అవసరమైన అవకాశాలు కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత. అదే సమయంలో డబ్బు విలువ, పొదుపు ప్రాముఖ్యత, అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి విషయాలను నేర్పించడం కూడా అంతే ముఖ్యం. పిల్లలు కోరిన ప్రతి వస్తువును వెంటనే కొనివ్వడం కన్నా, ఆ వస్తువు నిజంగా అవసరమా? కొంతకాలం తర్వాత కూడా దాని అవసరం ఉంటుందా? మన కుటుంబ బడ్జెట్‌కు అది సరిపోతుందా? అనే ప్రశ్నలు అడగడం నేర్పాలి. ఇలా చేయడం పిల్లల కోరికలను అణచివేయడం కాదు. కోరికలను బాధ్యతతో సమతుల్యం చేసుకోవడం నేర్పడం. మరోవైపు తల్లిదండ్రులు కూడా తమ వృద్ధాప్యం, ఆరోగ్య అవసరాలు, పదవీ విరమణ అనంతర జీవితం గురించి ఆలోచించాలి. పిల్లల కోసం పొదుపు చేయడం ఎంత ముఖ్యమో, తమ భవిష్యత్తు కోసం ఆర్థిక పునాది నిర్మించుకోవడం కూడా అంతే అవసరం. ఎందుకంటే పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించాలంటే తల్లిదండ్రుల వర్తమానం, భవిష్యత్తు రెండూ ఆర్థికంగా నిలకడగా ఉండాలి.

వేడుకలు.. జ్ఞాపకాల కోసమా, హోదా కోసమా?

పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, గృహప్రవేశాలు, వివాహాలు.. కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకునే సందర్భాలు మన జీవితంలో ప్రత్యేకమైనవి. బంధువులను కలుసుకోవడం, స్నేహితులతో సంతోషాన్ని పంచుకోవడం, జ్ఞాపకాలను సృష్టించుకోవడం విలువైన విషయాలే. అయితే కొన్ని సందర్భాల్లో వేడుకల అసలు ఉద్దేశం వెనుకబడిపోతోంది. ఎంతమంది అతిథులను పిలిచాం ఎంత ఖర్చు చేశాం అలంకరణ ఎంత వైభవంగా ఉంది? భోజనంలో ఎన్ని రకాలు ఉన్నాయి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ఎంత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి? అనే అంశాలే ప్రాధాన్యం పొందుతున్నాయి. ఇతరులు నిర్వహించిన వేడుకలతో పోల్చుకొని, మనం కూడా అంతకంటే ఘనంగా నిర్వహించాలనే పోటీ మొదలవుతోంది. ఆర్థిక స్థోమతకు మించిన ఖర్చులు చేస్తున్నా, సమాజంలో పరువు నిలబెట్టుకోవాలనే భావన వెనక్కి తగ్గనివ్వడం లేదు. వేడుక ముగిసిపోతుంది. అతిథులు వెళ్లిపోతారు. ఫొటోలు జ్ఞాపకాలుగా మిగులుతాయి. కానీ ఆ వేడుక కోసం చేసిన అప్పు మాత్రం నెలల తరబడి వెంటాడుతుంది. ఆనందాన్ని పంచుకోవడానికి ఖర్చు అవసరమే కావచ్చు. కానీ ఆ ఆనందం కోసం భవిష్యత్తు ప్రశాంతతను కోల్పోవాల్సిన అవసరం లేదు. వేడుక ఎంత ఘనంగా జరిగిందన్నదానికంటే, అది ముగిసిన తర్వాత కుటుంబం ఎంత ప్రశాంతంగా ఉందన్నదే నిజమైన ఆర్థిక వివేకానికి కొలమానం.

పొదుపు అంటే కేవలం మిగిలిన డబ్బు మాత్రమే కాదు

మనలో చాలామంది ఖర్చులన్నీ తీర్చిన తర్వాత మిగిలిన డబ్బును పొదుపు చేయాలనుకుంటారు. కానీ ఖర్చులకు స్పష్టమైన హద్దులు లేకపోతే ఎంత ఆదాయం వచ్చినా మిగిలేది తక్కువే. పొదుపును నెలాఖరులో మిగిలే మొత్తంగా కాకుండా, ఆదాయం వచ్చినప్పుడే కేటాయించాల్సిన బాధ్యతగా చూడాలి. ఎక్కువ సంపాదించడం తప్పు కాదు. మంచి ఇల్లు ఉండాలని కోరుకోవడం తప్పు కాదు. కుటుంబంతో ప్రయాణాలు చేయడం, మంచి ఆహారం తీసుకోవడం, నాణ్యమైన విద్య అందించడం, ఆధునిక సౌకర్యాలు వినియోగించుకోవడం కూడా తప్పు కాదు. కానీ ఈ సౌకర్యాలన్నింటినీ సమకూర్చుకునే క్రమంలో మన ఆర్థిక స్వేచ్ఛను కోల్పోతున్నామా లేదా అన్నది పరిశీలించుకోవాలి.

భార్యాభర్తలు తమ ఆదాయం, అప్పులు, పొదుపులు, భవిష్యత్తు లక్ష్యాల గురించి బహిరంగంగా చర్చించుకోవాలి. ఆర్థిక విషయాలను ఒకరే నిర్వహించకుండా, ఇద్దరికీ కుటుంబ ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన అవగాహన ఉండాలి. అలాగే జీతం పెరిగిన ప్రతిసారీ జీవనశైలిని మార్చుకోవాల్సిన అవసరం లేదు. కొంత మొత్తాన్ని భవిష్యత్తు లక్ష్యాలకు కేటాయిస్తూ, మిగిలిన మొత్తంతో అవసరాలకు అనుగుణంగా జీవించవచ్చు.

ఇక్కడ ప్రధానంగా మారాల్సింది ఆదాయాన్ని సంపాదించే పద్ధతి మాత్రమే కాదు.. దానిని వినియోగించే ఆలోచనా విధానం కూడా.

మనకు కావాల్సింది మరిన్ని వస్తువులా.. లేదా భరోసానా?

నేటి మనిషి జీవితంలో సౌకర్యాలు పెరిగాయి. అవకాశాలు విస్తరించాయి. సంపాదనకు మార్గాలు పెరిగాయి. అయినప్పటికీ భవిష్యత్తు గురించి ఆందోళన తగ్గకపోవడం ఆలోచించాల్సిన విషయం. ఆదాయం పెరిగినా ఖర్చులు అదే వేగంతో పెరిగితే, ఆర్థిక భద్రత దూరంగానే ఉంటుంది. ఇతరులతో పోల్చుకొని జీవిస్తే మన సంపాదనకు ఎప్పుడూ హద్దులు కనిపించవు. ప్రతి కొత్త వస్తువును అవసరంగా భావిస్తే కొనుగోళ్లకు ముగింపు ఉండదు. భవిష్యత్తులో సంపాదించబోయే డబ్బును వర్తమానంలోనే ఖర్చు చేస్తే రేపటి అనిశ్చితిని ఎదుర్కోవడం కష్టమవుతుంది. ఆధునికతను తిరస్కరించడం పరిష్కారం కాదు. ఆధునిక సౌకర్యాలను వివేకంతో వినియోగించుకోవడమే అసలైన పరిష్కారం. మన ఆర్థిక స్థోమతకు తగిన జీవనశైలిని ఎంచుకోవడం, అనవసరపు పోటీలకు దూరంగా ఉండటం, పొదుపును అలవాటుగా మార్చుకోవడం, భవిష్యత్తు అవసరాలకు ముందుగానే సిద్ధపడటం అవసరం. ఒక కుటుంబం ఎంత సంపాదిస్తుందన్నది దాని ఆర్థిక స్థితిని కొంతవరకు తెలియజేస్తుంది. కానీ ఆ సంపాదనలో ఎంత భాగం కుటుంబ భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తుందన్నదే దాని ఆర్థిక ఆరోగ్యాన్ని మరింత స్పష్టంగా తెలియజేస్తుంది. ఎందుకంటే నిజమైన సంపద అంటే మన దగ్గర ఎన్ని వస్తువులున్నాయన్నది కాదు.. రేపు ఏదైనా అనుకోని పరిస్థితి ఎదురైనా ఆత్మవిశ్వాసంతో నిలబడగలిగే సామర్థ్యం ఎంత ఉందన్నది. ఆదాయం మనకు జీవన సౌకర్యాలను అందించవచ్చు. పొదుపు మనకు భవిష్యత్తుపై నమ్మకాన్ని అందిస్తుంది. ఆర్థిక వివేకం ఈ రెండింటి మధ్య సమతుల్యతను నేర్పుతుంది.

చివరకు ప్రతి కుటుంబం తనను తాను ప్రశ్నించుకోవాల్సింది ఒక్కటే.. మన సంపాదన మన జీవితాన్ని సుసంపన్నం చేస్తోందా లేక మనమే సంపాదన కోసం పరుగులు తీస్తూ, ఆ సంపాదనను ఖర్చు చేసే పోటీలో మనశ్శాంతిని కోల్పోతున్నామా అని



- సంధ్య అడుప
రచయిత్రి



ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను తక్షణమే
రెగ్యులరైజేషన్ చేయాలి

- బి.కె.యం.యు.జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్

అక్షరశక్తి, వరంగల్: నగరంలోని పోచమ్మ మైదాన్ సర్కిల్ లో ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరవధిక సమ్మెకు మంగళవారం నాటికి 15వ రోజు చేరుకుంది. ఈ సందర్భంగా (బి.కె.యం.యు.) భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు నిరవధిక సమ్మెకు విచ్చేసి సంఘీభావం తెలపడం జరిగింది. సందర్భంగా తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ... తక్షణమే ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డ్స్, హెల్త్ ఇన్సూరెన్స్, లోయాల్టీ బోనస్, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు 180 రోజులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా. టీ భరత్ కుమార్, డాక్టర్. దిలీప్ ,డాక్టర్ కిరణ్, డాక్టర్ హుస్సేన్, డాక్టర్. హరికృష్ణ , డాక్టర్ సునీత దేవి , డాక్టర్ నిఖిల్ , డాక్టర్ రాజారామ్ ,డాక్టర్. యశస్విని, డాక్టర్.అనిత, డాక్టర్. సదానందం, డాక్టర్ రమ్య, డాక్టర్ మధు, డాక్టర్. హరిక , డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్చన, ఈవిన్ మేనేజర్ రవీందర్, డైకు మేనేజర్ మేర్గు అనిల్ కుమార్ , నర్సింగ్ ఆఫీసర్స్ స్వప్న, కళ్యాణి, మంజుల, సుమలత, ఫార్మసీ ఆఫీసర్ నూకల అంజి యాదవ్, తీగల సతీష్ కుమార్, అకౌంటెంట్ ఆచంట అభిషేక్, శ్వేత, ప్రేమలత, శ్రీనివాస్ బాబు, టీ.బి.డిపార్ట్మెంట్ రంజిత్ , రాకేష్, ఏ.ఎన్.ఎం.లు జ్యోతి ,సుల్తానా , పేనీన, ఉప్పలమ్మ, నర్మద, రాజేశ్వరి, ప్రభావతి, అనిత ,శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్లు జూకంటి మౌనిక, ఎం.ఎన్.ఓ. ఏకుల చిరంజీవి , బండి రాజేష్, కుమార్, సపోర్టింగ్ స్టాఫ్ గౌస్ పాషా, గూడెపు ప్రభాకర్, రజియా మరియు తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం ఏర్పాటు



అక్షరశక్తి, నర్సంపేట: తెలంగాణ రక్షణ సేన మహబూబాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ బోడ అనిల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సంపేటలోని అంగడి సర్కిల్ దగ్గర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డా. బోడ అనిల్ కుమార్ నాయక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తమ బాధ్యతగా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, అర్హులైన పట్టభద్రులు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకునేలా ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు మహేందర్ సంతోష్ తరుణ్ దేవేందర్ సురేష్ విగ్నేష్ నరేష్ సందీప్ నాగరాజు అభిషేక్ రెడ్డి సాయి వంశీ కిషన్ భరత్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు గౌతమ్ కృష్ణ



అక్షరశక్తి, కమలాపురం: కమలాపురం మండలం గూడురు గ్రామానికి చెందిన తెప్ప స్వామి కుమారుడు తెప్ప గౌతమ్ కృష్ణ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ములుగులో నిర్వహించిన అండర్ 17 క్రికెట్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్టులో చోటు సంపాదించారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పాఠశాల క్రికెట్ పోటీల్లో గౌతమ్ కృష్ణ పాల్గొననున్నారు. హనుమకొండ నక్కల గుట్టలోని జయభారతి కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- డీఈఓకు టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా శాఖ వినతి

అక్షరశక్తి,వరంగల్: జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) వరంగల్ జిల్లా శాఖ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి (ఎఫ్ఏసీ) ప్రశాంత్ రెడ్డిని కోరారు. వరంగల్ జిల్లా నూతన ఎఫ్ఏసీ డీఈఓగా ఇటీవల నియమితులైన ప్రశాంత్ రెడ్డిని టీపీటీఎఫ్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధ్యాయులు, పాఠశాలలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యాబోధనకు ఇబ్బందులు కలగకుండా వర్క్ అడ్జస్ట్మెంట్ కింద వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు, ఆయాల నియామకాలను తక్షణమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా స్కావెంజర్ల వేతనాలు విడుదల కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ 2024 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు రెండో ఇంక్రిమెంట్ మంజూరు చేయడంతో పాటు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని డీఈఓకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల వీరస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి. ముజాహిద్, జిల్లా కార్యదర్శి బెల్లంకొండ పూర్ణచందర్, పూర్వ జిల్లా అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. మనోజ్‌తో పాటు మండల బాధ్యులు రాజేష్, కొమురయ్య, బి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ శాఖ ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించండి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

అక్షరశక్తి, హనుమకొండ: ప్రజావాణి కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎక్సైజ్ శాఖ అధికారులతో వారి కార్యకలాపాల పైన కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు, జిల్లాలో అక్రమ మద్యంపై ఇప్పటి వరకూ నమోదు చేసిన కేసులు, బెల్ట్ షాపుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎక్సైజ్ శాఖ అధికారుల నుండి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 27 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, ట్రైనీ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నీలోఫర్ అజ్మీ, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



గవర్నర్ కోట ఎమ్మెల్సీ పదవుల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్

అక్షరశక్తి, హనుమకొండ: ఎలక్షన్ల ముందు బీసీల జపం చేసి, అధికారంలోకి వస్తే విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని నమ్మబలికి..కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక బీసీల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్న కాంగ్రెస్ బీసీల వ్యతిరేక వైఖరిని మార్చుకొని వచ్చే నెలలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న మూడు ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవుల్లో రెండు నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవులను బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయ పదవులు, నిర్ణయాధికారంలో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అగ్రవర్ణ పార్టీలు బీసీలను ఓటర్లుగానే పరిగణిస్తున్నారని, ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులోనూ ఆర్థిక స్తోమత లేదనే కారణాలతో ఎమ్మెల్యే టికెట్లను నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా..సామాజిక న్యాయం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఇద్దరు రెడ్లకు టికెట్లను కేటాయించి బీసీలను తీవ్రంగా అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న ఎమ్మెల్సీ పదవుల్లో అర్హత, సామాజిక సేవ, పార్టీ పట్ల నిబద్ధత కలిగిన బీసీ నాయకులకు అవకాశం కల్పించాలని వేణుగోపాల్ గౌడ్ కాంగ్రెస్ ను డిమాండ్ చేశారు.



Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.